సాక్షి ప్రకాశం

ఆదివారం । 23 । జూలై । 2023



ప్రేమ మాటున దగా

తాను ప్రేమించిన యువతిని కిడ్నాప్ చేసి పెళ్లికి ఒప్పుకోకపోవడంతో గొంతు, ముఖం పై బీరుబాటిల్‌తో దాడిచేసి గాయపరిచాడు.

- 8లో..



తండ్రిని చంపిన కుమారుడు

క్షణికావేశంలో ఓ వ్యక్తి తన తండ్రికి కర్రతో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన తండ్రి మృతిచెందిన ఘటన గిద్దలూరులో జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్ ఆవిష్కరణ



స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ లక్ష్యాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ దినేష్ కుమార్ శనివారం స్పందన భవనంలో ఆవిష్కరించారు. లక్ష్యాలను ప్రజలకు తెలియజేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పోస్టర్లు పంపిణీ చేస్తారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ఈ పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించేందుకు వీలవుతుందన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందన మద్దిపాడులో..

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం 24వ తేదీ సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మద్దిపాడులోని ఆవాస్ రిసార్ట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన నిర్వహిస్తారన్నారు. అనంతరం 3 గంటల నుంచి నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. దీనికి జిల్లా అధికారులంతా హాజరవుతున్నారని, నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్‌ఆర్ సాఫల్య పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్‌ఆర్ జీవిత సాఫల్య, వైఎస్‌ఆర్ సాఫల్య పురస్కారాలు అందించేందుకు నిర్ణయించి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవలు, ప్రజా సేవ, సైన్స్, ఇంజినీరింగ్, లిటరేచర్, క్రీడలు, విద్యారంగం, వైద్య రంగం, వాణిజ్యం, పరిశ్రమల రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తిగతంగా అత్యంత ప్రతిభ కనపరిచిన వారికి పురస్కారాలు అందజేస్తారన్నారు. అదేవిధంగా గ్రామ, మురికి వాడల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు, స్వచ్ఛంద సంస్థలు, చారిత్రక స్వభావం కలిగి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని నిలిచిన సంస్థలు, సంఘాలు, పురస్కారాలకు అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఈ సేవలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థలు ఉంటే అన్నీ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 31వ తేదీ లోపు నేరుగా అందజేయాలన్నారు. వివరాలకు 91828 91095 నంబర్‌ను పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

దివ్యాంగ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఒంగోలు: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులైన (వికలాంగ) బాలుర కోసం స్థానిక సంతపేటలో ప్రత్యేక వసతిగృహం నిర్వహిస్తారని, అందులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి.అర్చన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహంలో 1 నుంచి 12వ తరగతితోపాటు ఉన్నత చదువులు చదువుకునే వారికి అవకాశం ఉందన్నారు. శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి ప్రభుత్వ వైద్యశాల నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన బాలురు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు అర్హులన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. పూర్తి వివరాలకు కార్యాలయ ఫోన్ 08592-232810 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ముందుగానే పుస్తకాలు..

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం రోజే మొదటి సెమిస్టర్ పుస్తకాలు అందజేసిన ప్రభుత్వం రెండో సెమిస్టర్ పుస్తకాలను మూడు నెలల ముందుగానే విద్యార్థుల చేతుల్లో పెట్టింది. నూతన పాఠ్యపుస్తకాలు సరికొత్త హంగులతో నాణ్యతగా తయారు చేశారు. ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి 8.17 లక్షల పుస్తకాలు నెల ముందుగానే ఒంగోలుకు చేరుకున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇక్కడ నుంచి సత్వరం స్కూల్ కాంప్లెక్స్‌లకు చేర్చారు. శనివారం నుంచే అన్ని స్కూళ్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు పుస్తకాల పంపిణీ ప్రారంభించారు.



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు

- నవంబర్‌లో రెండో సెమిస్టర్ ప్రారంభం
- ఉమ్మడి ప్రకాశానికి చేరిన 8.17 లక్షల పుస్తకాలు
- నెల రోజులకు ముందే పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ
- ఒంగోలులో పంపిణీని ప్రారంభించిన కలెక్టర్
- ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల చెంతకు పుస్తకాలు

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి నాణ్యమైన విద్యను అందిస్తోంది. కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించడమే కాకుండా అదే స్థాయిలో బోధన జరిగేలా చూస్తోంది. అందులో భాగంగా విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం పూర్తయినా పుస్తకాలు అందని దుస్థితి ఉండేది. అందుకు భిన్నంగా నేడు ముందుగానే విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తోంది. రెండు సెమిస్టర్ పుస్తకాలను సకాలంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు అందాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి రెండో సెమిస్టర్‌లో 8,17,457 పాఠ్యపుస్తకాలు ఒంగోలుకు చేరాయి. వందశాతం పాఠ్య పుస్తకాలు రావడంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 12 నియోజకవర్గాల్లోని పాఠశాలలకు పంపిణీ చేసే ప్రక్రియను అధికారులు చేపట్టారు. నవంబరు నుంచి ప్రారంభమయ్యే రెండో సెమిస్టర్‌కు సంబంధించి ఒంగోలు నగరంలోని గోదాము నుంచి గత నెలలోనే మండలాలకు, అక్కడ నుంచి స్కూల్ కాంప్లెక్స్‌లకు అక్కడ నుంచి నేరుగా పాఠశాలలకు చేరాయి. పదో తరగతికి ఒకే సెమిస్టర్ కింద తొలి సెమిస్టర్‌లోనే పాఠ్యపుస్తకాలు అందించారు. రెండో సెమిస్టర్‌లో ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు పలు పుస్తకాలను బైలింగ్యువల్ (తెలుగు–ఆంగ్లం రెండు భాషలు ఒకే పుస్తకంలో) ఉండేలా ముద్రించారు. ఇది వాస్తవానికి ప్రభుత్వానికి రెట్టింపు ఖర్చుతో కూడుకుంది. అయినా ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు పెరగాలన్నా, విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు రావాలన్నా అందుకు రెండు భాషలతో కూడిన పాఠ్యపుస్తకాల ముద్రణ అవసరమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అందులో భాగంగా ఒకపేజీలో ఆంగ్లంలో ప్రచురితమైతే పక్క పేజీలో అదే అంశానికి సంబంధించిన వివరాలు తెలుగులో ముద్రించారు. ఫలితంగా విద్యార్థులు ఆంగ్లంలో చదువుకుంటూ ఏదైనా పదానికి సందేహం వస్తే దానికి సరైన తెలుగు అర్థం పక్కపేజీలోనే చూసుకునే సౌలభ్యాన్ని కల్పించారు. రెండో సెమిస్టర్‌లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తే ఒకటో తరగతి, రెండు తరగతికి గణితం, 3, 4, 5 తరగతులకు గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, 6, 7 తరగతులకు గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్, 8వ తరగతికి గణితం, ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. 9వ తరగతికి మాత్రం గణితం, ఫిజిక్స్ మాత్రమే రెండో దశలో పంపిణీ చేస్తున్నారు. మిగిలిన అన్ని పుస్తకాలు మొదటి సెమిస్టర్‌లోనే విద్యార్థులకు అందించారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ప్రతి పేద విద్యార్థి ఉన్నతంగా రాణించాలనేదే ప్రభుత్వ ఆకాంక్ష

శనివారం స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. చదువుకు ఆర్థిక భారం ఉండరాదని, ప్రతి పేద విద్యార్థి కార్పొరేట్ కంటే దీటుగా విద్యార్జన చేయాలనే లక్ష్యంతో జగనన్న విద్యాకానుకను ప్రవేశపెట్టిందన్నారు. గతంలో పాఠ్యపుస్తకాలు ఇంకా తమకు అందలేదనే భావన విద్యార్థుల నుంచి వచ్చేదని, కానీ నేడు మూడు నెలల ముందుగానే పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేయగలగడం మీ అదృష్టం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాప్రమాణాలు పెంపుదలకు అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేవలం పుస్తకాల పంపిణీ మాత్రమే కాకుండా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ పూర్తిచేయడంతోపాటు త్వరలోనే వాటికి సంబంధించిన కుట్టుకూలీ కూడా తల్లుల ఖాతాలో జమచేసేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. నాడు– నేడు మన బడి పేరుతో ప్రభుత్వం ఇప్పటికే వందల కోట్లు వెచ్చిస్తోందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పేదరికం రూపుమాపాలంటే అందుకు ఉత్తమ విద్యార్జన ఒక్కటే మార్గమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారన్నారు. గుంటూరు ఆర్‌జేడీ, ఇన్‌చార్జి డీఈవో వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత చర్యలు చేపట్టినా అవి క్షేత్రస్థాయిలో విజయవంతమవ్వాలంటే అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తూ వారిలో పోటీతత్వం పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేలో వలంటీర్లు వద్దు

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేలో వలంటీర్లు పాల్గొనకూడదని, అలాకాకుండా బీఎల్‌ఓలతో వలంటీర్లు ఉంటే సంబంధిత బీఎల్‌ఓలపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్పందన భవనంలో నియోజకవర్గాల అభివృద్ధి పనులపై మండల స్థాయి ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన నీటిని కేవలం తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలన్నారు. నీటిని ఎట్టి పరిస్థితిల్లో వ్యవసాయ అవసరాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున తాగునీటి చెరువుల్లో నింపిన నీటిని జాగ్రత్తగా వినియోగించేలా చూడాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు మండలాలకు వెళ్లినప్పుడు ఏ అంశాలపై సమీక్షించాలి, ఏ అంశాలను సందర్శించాలి అనే విషయాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు 5 కీలకమైన అంశాలకు సంబంధించి నివేదికలను వెంటనే అందజేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను వారి పరిధిలోని హౌసింగ్ లే అవుట్‌లలో గుర్తించిన సమస్యలను ఫీడ్‌బ్యాక్ రూపంలో పంపించాలని సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనుమతులు పొందిన నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన



సంక్షేమ పథకాల లబ్ధి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: రాష్ట్రంలో అన్ని వర్గాలు హర్షించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని మద్దలకట్ట సచివాలయ పరిధిలో చాట్లమడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ప్రజల తాగునీటిని తీర్చేందుకు వేసిన డీప్ బోరును ప్రారంభించారు. మంత్రి ఇంటింటికీ తిరుగుతూ నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఒకటో తారీకున ఇంటి వద్దకే పింఛన్ అందించడంతో అవ్వాతాతలు, వికలాంగులు చిరునవ్వులు చిందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పథకాలను కాపీ కొడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మేనిఫెస్టో తయారు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామ స్వరాజ్య స్థాపన జగనన్నతోనే సాధ్యమైందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడుకుంటూ అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా సుపరిపాలన చేస్తున్న ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కిందని కొనియాడారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన నిర్ణయాలతో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు నిరంతరం అమలు చేస్తున్నారని చెప్పారు. కరోనా కాలంలో ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా సజావుగా సాగించారని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని, దేశంలోనే ఇటువంటి బృహత్తర కార్యక్రమం మరెక్కడా జరగ లేదన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత సీఎం జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని గుర్తించాలని, గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా, వైద్య రంగాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తుంచుకొని వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ గుంటు గాలెమ్మ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, మాజీ ఎంపీపీ జబ్బా రాజయ్య, డీటీ సిహెచ్ రాజేష్, ఈఓఆర్డీ బాలకోటయ్య, విద్యుత్ ఏఈ రమేష్, పీఎస్ శ్రీనివాసరెడ్డి, బీసీ నాయకులు రాచగొర్ల వెంకటపిచ్చయ్య, మూల సత్యానారాయణరెడ్డి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, గాదం మల్లికార్జున, మూల శ్రీనివాసరెడ్డి, దుద్దెల కోటిరెడ్డి, తాతిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, సొంటి నాగార్జున రెడ్డి, వార్డు సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి వేదికగా లోకేష్ అబద్ధాలు

మార్కాపురం: పొదిలి వేదికగా నారా లోకేష్ అబద్ధాలు మాట్లాడటంతో ప్రజలు అవాక్కయ్యారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివినట్టుగా ఉందని ప్రజలు ఎద్దేవా చేశారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై లోకేష్ చెప్పిన మాటలు విని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. 2018 నవంబరు 29న ఆయన గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి హోదాలో వచ్చి టిడ్కో ఇళ్లకు పునాదిరాయి మాత్రమే వేశారు. అయితే తన ప్రసంగంలో 90 శాతం ఇళ్లు పూర్తి చేశామని, మిగిలిన పదిశాతం అధికారంలోనికి రాగానే పూర్తిచేసి పాలు పొంగిస్తామని చెప్పటంపై సర్వత్రా విస్మయాన్ని వ్యక్తంచేశారు. ఇక కోల్డ్ స్టోరేజీకి కూడా శంకుస్థాపన చేశారు కానీ నిధులు కేటాయించలేదు. అయితే పొదిలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోనికి రాగానే దానిని కూడా ప్రారంభిస్తామని చెప్పడం గమనార్హం.

వెలిగొండపై అదే మాట..

వెలిగొండ ప్రాజెక్టుపై మళ్లీ పాతపాటే పాడారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి హోదాలో కనీసం మార్కాపురానికి వచ్చి వెలుగొండపై రివ్యూ చేసిన దాఖలాలు లేవు. ఐదేళ్లు కాలయాపనచేసి మళ్లీ ఇప్పుడు అధికారంలోనికి వస్తే వెంటనే పూర్తిచేస్తానని హామీ ఇవ్వడంపై కూడా లోకేష్ ప్రసంగానికి వచ్చిన ప్రజలు ఆశ్చర్యపోయారు.

ప్చ్..మాకే కలిసేందుకు లేదు...

పొదిలి: యువగళం పాదయాత్ర షెడ్యూల్‌పై స్థానిక ముఖ్య నాయకులు పెదవి విరుస్తున్నారు. కనీసం పది నిముషాలు కేటాయించలేని షెడ్యూలు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు. రాత్రి పది గంటల సమయంలో రెస్ట్ పాయింట్‌లోకి వెళ్లిన లోకేష్ తిరిగి మరుసటి రోజు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వచ్చేలా షెడ్యూలు రూపొందించారు. ఈ మధ్య సమయంలో కొంతసేపు ముఖ్యులకు కేటాయిస్తే వారు వారి సమస్యలు వినిపించేందుకు అవకాశం ఉండేది కదా అంటున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎవరినీ అనుమతించవద్దని లోపలి నుంచి ఆదేశాలు ఉన్నాయని పోలీసులు చెప్పటంతో సదరు నాయకులు నిట్టూర్చారు.

నిరుత్సాహంగా పాదయాత్ర

పొదిలిరూరల్/తర్లుపాడు: పొదిలి మండలంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర నిరుత్సాహంగా సాగింది. పోతవరం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన పాదయాత్రకు ఆశించినంతగా జనం రాక పోవడంతో తెలుగు తమ్ముళ్లు డీలా పడ్డారు. పాదయాత్ర మొదలు నుంచి చివరి వరకు కేవలం బహిరంగ సభలో తప్ప ఎక్కడా మాట్లాడలేదు. కేవలం అభివాదం, సెల్ఫీలు, షేక్ హ్యాండ్లతోనే సాగింది. షెడ్యూల్‌లో పొదిలి–4వ వార్డు, కాటూరివారిపాలెంలో స్థానికులతో మాట్లాడతారని ప్రకటించారు. కానీ ఆ రెండు చోట్ల సమావేశం జరగక పోవడంతో వచ్చిన వారు నిరుత్సాహంగా వెనుదిరిగారు. పాదయాత్ర సందర్భంగా మందు బాబులు చేసిన హంగామా, కార్యకర్తల అత్యుత్సాహంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాదయాత్ర పొదిలి టౌన్‌లోకి ప్రవేశించాక రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పొదిలి జిల్లా నడి కూడలి కావడంతో కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, దర్శి దూర ప్రాంతాలకు పోయే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పట్టణ శివారుల్లోనే వాహనాలు ఆపివేయడంతో ప్రజలు, ప్రయాణికులు, వృద్ధులు అవస్థపడ్డారు. పొదిలిలో జరిగిన పాదయాత్రకు చుట్టు పక్కల మండలాల నుంచి జన సమీకరణ చేసినా ఆశించిన మేర జనం రాలేదు.



మందుబాబుల హంగామాతో ట్రాఫిక్‌కు అంతరాయం



పాదయాత్ర చేస్తున్న లోకేష్

ఆంధ్రాలో ఇప్పటికే 13 మహిళల వన్‌స్టాప్ సెంటర్లు

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్‌కు గత మూడేళ్లలో 26 మహిళల వన్‌స్టాప్ సెంటర్లు మంజూరు చేశామని, వాటిలో 13 సెంటర్లు పనిచేస్తున్నట్లు కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరాని సమాధానం ఇచ్చారు. మహిళల వన్‌స్టాప్ సెంటర్లు–ఏపీలో ఏర్పాటు, వాటికి కేటాయించిన నిధులకు సంబంధించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం, చిత్తూరు, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, ఎన్‌టీఆర్ జిల్లా, విశాఖపట్నం, విజయనగరం, ఏలూరు పట్టణాల్లో ఈ సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయన్నారు. 2020–21లో రూ.2.05 కోట్లు, 2021–22లో రూ.2.49 కోట్లు, 2022–23లో రూ.72.95 లక్షలు ఇప్పటి వరకు విడుదల చేశామన్నారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి 2020–21లో రూ.18.50 లక్షలు, 2021–22లో రూ.33.25 లక్షలు, ప్రస్తుత ఏడాది రూ.13.26 లక్షలు విడుదల చేశామన్నారు. బాధిత మహిళలకు పోలీసు రక్షణ, న్యాయ సహాయం, మానసిక– సాంఘిక విషయాలపై అవగాహన, వైద్య సదుపాయం, తాత్కాలిక వసతి తదితర ముఖ్య అవసరాలు కల్పిస్తున్నామని కేంద్రమంత్రి వివరించారు.

క్లుప్తంగా

రాళ్లవాగులో గుర్తు తెలియని మృతదేహం


మహిళ మృతదేహం

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి సమీపంలోని రాళ్లవాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శనివారం పోలీసులు కనుగొన్నారు. దాదాపు 50 సంవత్సరాల వయస్సు గల ఆమె తెలుపు రంగు రవిక, ఎరుపు, నలుపు రంగుల పూల డిజైన్‌తో కూడిన పసుపు చీర, పాచి రంగు లంగా ధరించి ఉంది. మృతురాలి ఎడమ చేతి ముందు వైపు కృష్ణమ్మ, వెనకవైపు శ్రీరాములు నీ పోకమ్మ, ముగ్గు డిజైన్‌తో కూడిన పచ్చబొట్లు న్నాయి. 3 రోజుల క్రితం వాగులో ప్రమాద వశాత్తు పడి ఉంటుందని, లేకుంటే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై జి.కోటయ్య తెలిపారు. వివరాలు తెలిసిన వారు డయిల్ 100కు కానీ, సెల్ నంబర్లు 9121102192, 9121102193కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

ఉసురు తీసిన క్రికెట్ బెట్టింగులు


రైలు పట్టాలపై శ్రీకాంత్ మృతదేహం

ఒంగోలు టౌన్/ సింగరాయకొండ: క్రికెట్ బెట్టింగ్‌లతో తీవ్రంగా నష్టపోయిన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... కొండపి బీసీ కాలనీకి చెందిన కుంకి శ్రీకాంత్ (30) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. చెడు స్నేహాలతో తిరుగుతూ కొంతకాలంగా క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడిపోయాడు. ఈ క్రమంలో అప్పులపాలయ్యాడు. ఆ అప్పులు తీర్చే మార్గం కానరాక పొలం అమ్మి రూ.25 లక్షలు అప్పులు తీర్చాడు. అతడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలిసి భార్య నిలదీయడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి చెన్నై వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరయ్యాయి. రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ మాటున దగా

- యువతి ముఖం, గొంతుపై బీరుబాటిల్‌తో గాయాలు చేసిన యువకుడు
- పెళ్లి చేసుకోకపోతే చంపుతానని బెదిరింపు
- సహకరించిన నిందితుల కూడా అరెస్ట్
- వారిలో ఒకరు మైనర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

కురిచేడు: తాను ప్రేమించిన యువతిని కిడ్నాప్ చేసి పెళ్లికి అంగీకరించకపోవటంతో గొంతు, ముఖంపై బీరుబాటిల్‌తో గాయపరచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీసీపల్లి మండలం లింగన్నపాలేనికి చెందిన కోవెలకుంట్ల వీర నారాయణాచారి తన మేన మామ గ్రామమైన పెద్ద ఇర్లపాడు గ్రామంలో పెరిగాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యువతితో సన్నిహితంగా ఉండేవాడు. కాగా ఆ యువతి గత మేనెలలో మండలంలోని ఓ పోస్టల్ శాఖలో అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టరుగా ఉద్యోగంలో చేరింది. కురిచేడులోని మరో యువతితో కలిసి ఓ గది అద్దెకు తీసుకుని నివసిస్తోంది. రెండు నెలల క్రితం యువతి వెంటన పడిన వీరనారాయణా చారి పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడంతో ఆమె తన తల్లిదండ్రులకు తెలిపింది. గ్రామపెద్దల సమక్షంలో ఇరు కుటుంబాల వారు చర్చలు జరిపి ఇకపై ఒకరిని ఒకరు కలవకుండా ఉండేలా ఒప్పందం కుదుర్చారు. వీరనారాయణాచారి వద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు డిలీట్ చేశారు. అయితే ఈనెల 18 న వీరనారాయణా చారి తన స్నేహితుడు గొరిగే దిలీప్ కుమార్‌తో పాటు 18 ఏళ్ల వయసున్న మరో యువకుడితో కలిసి కారు, బైక్‌తో యువతి ఉద్యోగం చేసే గ్రామం వెళ్లారు. ఆమెను కారులో ఎక్కించుకుని, యువతి స్కూటీని ఓ నిందితుడు దారిలో వదిలేసి పొదిలి మండలం కంభాలపాడు వద్ద ఓల్డ్ బీఈడీ కళాశాల గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ పెళ్లి చేసుకోవాలని వీరనారాయణాచారి ఆమెను బెదిరించాడు. లేకుంటే చంపుతానని హెచ్చరించడంతో పరిస్థితి గమనించిన బాధితురాలు తన తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని బతిమాలింది. అక్కడ నుంచి సాయంత్రం 5 గంటలకు ఆమెను బైక్‌పై తీసుకుని దొనకొండ మండలం ఆరవల్లిపాడు, దొండపాడు గ్రామాల మధ్య ఆపి పెళ్లి చేసుకుంటావా ? లేదా? అంటూ తన వద్ద ఉన్న బీరు బాటిల్ పగలగొట్టి యువతి ముఖంపై, గొంతుపై కోశాడు. తనని కురిచేడులో వదిలిపెట్టాలని బతిమాలటంతో ఆమె అద్దెకు ఉంటున్న గది వద్ద వదిలి వెళ్లిపోయాడు. జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియపరిచింది. తండ్రి వచ్చి దర్శిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించాడు. అక్కడ వైద్యశాల సిబ్బంది దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌కు విషయం తెలియజేయటంతో దర్శి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు వివాహ సంబంధాలు చూస్తున్నామని, విషయం బయట పడితే పరువు పోతుందని కేసు వద్దని వారించారు. డీఎస్పీ హామీ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం దర్శి మండలం వెంకటాచలంపల్లి అడ్డరోడ్డు వద్ద ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీతెలిపారు. త్రిపురాంతకం సీఐ పాపారావు, ఎస్సై దేవకుమార్ ఉన్నారు.

నిందితులకు బేడీలు

కురిచేడు: నిందితులకు రిమాండ్ విధించినట్లు ఎస్సై యం. దేవకుమార్ తెలిపారు. మొదటి నిందితుడు కోవెలకుంట్ల వీర నారాయణాచారి, రెండో నిందితుడు గొరిగె దిలీప్‌కుమార్‌లను దర్శి జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం హాజరు పరచగా జడ్జి సరస్వతి 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మూడో నిందితుడు మైనర్ కావటంతో ఒంగోలు జువైనల్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- టీటీడీ నుంచి రూ.1.65 కోట్లు మంజూరు
- ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూ.1.65 కోట్లు మంజూరు చేశారని, పనులు చురుగ్గా జరుగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక మాచర్ల రోడ్డులో నిర్మాణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కల్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అదనంగా నిధుల అవసరం ఉంటుందని, అందుకోసం టీటీడీ చైర్మన్ వైవీతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. టీటీడీ కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు విడుదల చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. అంచనాలలో 1/3వ వంతు చెల్లిస్తే పూర్తిస్థాయిలో నిధులు మంజూరవుతాయని వివరించారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపాలు రేకుల షెడ్లు మాదిరిగా ఉంటాయని, యర్రగొండపాలెంలో అందుకు భిన్నంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం స్లాబ్ పద్ధతిలో ఉంటుందని మంత్రి వెల్లడించారు. అదనంగా మరో రూ.60 లక్షల నిధులు కేటాయిస్తే కల్యాణ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. దాతలు ముందుకొచ్చి రూ.20 లక్షల విరాళాలు సేకరించాల్సి ఉందన్నారు. పెద్దారవీడు మండలంలోని గొడ్రాలికొండ తిరుమల నాథస్వామి ఆలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు అవసరం ఉంటుందని, అందుకు కామన్ గుడ్ ఫండ్‌కు రూ.21 లక్షలను ఆలయ ధర్మకర్త పోతంపల్లి వెంకటరెడ్డి తన సొంత డబ్బు చెల్లించారని హర్షధ్వానాల మధ్య మంత్రి తెలిపారు. అదేవిధంగా త్రిపురాంతకేశ్వరస్వామి దక్షిణ గోపురం నిర్మాణానికి కావాల్సిన నిధులకు కూడా దాతలు ముందుకు రావడం వలన నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయని చెప్పారు. టీటీడీ కల్యాణ మండపానికి కూడా నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దశాబ్దాల నాటి కల నెరవేరుతోంది...

టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మించుకోవాలని పట్టణ ప్రజలు దశాబ్దాలుగా కలలు కంటూ వచ్చారని, 2009-10లో తాను కల్యాణ మండపం నిర్మాణానికి అనేక ప్రయత్నాలు చేశానని మంత్రి సురేష్ గుర్తుచేశారు. ఆనాటి రాజకీయ పరిణామాల వలన కల్యాణ మండపానికి నిధులు మంజూరు కాలేదని, 2020-21లో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఈ ప్రాంతంపై ఉన్న అభిమానంతో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. కల్యాణ మండపం పక్కనున్న వాగును అభివృద్ధి చేసి వైఎస్సార్ రాళ్లవాగు రివర్ ఫ్రంట్ పార్కును అభివృద్ధి చేస్తామని అన్నారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి అధ్యక్షత వహించగా, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పుల్లలచెరువు మండల అధ్యక్షుడు బి.వి.సుబ్బారెడ్డి, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ యక్కలి భాగ్యారావు, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఐ.వి.సుబ్బారావు, సూరె రమేష్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందూరి కాశీవిశ్వనాథ్, కాంట్రాక్టర్ ఉడుముల కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఇది అక్కచెల్లెమ్మల ప్రభుత్వం

- రాజకీయంగానే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు ప్రాధాన్యం
- ప్రతిపక్షాలు ఒకవైపు మహిళలను అవమానిస్తూ.. మరోవైపు ఆత్మగౌరవం పేరుతో సభలు నిర్వహించడం సిగ్గుచేటు
- ప్రకాశం జిల్లాకు ఐదేళ్లలో చంద్రబాబు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

ఒంగోలు: జగనన్న ప్రభుత్వం అంటేనే అక్క చెల్లెమ్మల ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజకీయంగానే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు 58 శాతం వాటా కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది అని అన్నారు. టీడీపీ హయాంలో రిషితేశ్వరిపై జరిగిన దాడి, తహసీల్దారు వనజాక్షిపై జరిగిన దాడి, చంద్రబాబుకు వెన్నుదన్నుగా నిలిచిన కాల్ మనీ సెక్స్ రాకెట్ నిందితుల వల్ల బలైపోయిన మహిళలకు ఏం న్యాయం చేశారో సమాధానం చెప్పాలన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను రద్దుచేస్తామంటూ ఎన్నికల ముందు ప్రకటించి ఆ తర్వాత వారి రుణాలను రద్దుచేయకుండా మోసం చేసిన చంద్రబాబుకు మహిళల ఆత్మగౌరవం పేరుతో సభలు నిర్వహించే హక్కు లేదన్నారు. ఆ పార్టీ మహిళా నాయకురాలు అనిత ఆత్మగౌరవం పేరుతో మహిళా సభలు నిర్వహించే ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గ్రామస్వరాజ్య ఫలాలను ప్రజలకు అందిస్తున్న సచివాలయాలు, వలంటీర్లపై దారుణమైన నిందలు మోపడాన్ని ఖండించాలన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనను ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులతో పోలుస్తూ రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచిన అనిత ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. లోకేష్ పీఏ లోకేష్ కార్యాలయంలో పనిచేసే మహిళ పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోలేదో ప్రజలకు తెలియజేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మహిళలకు అండగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారి ఎదుగుదలకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుండటంతో ఓర్చుకోలేక కుళ్లు, స్వార్థ రాజకీయాలతో నిండిపోయిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు కలిసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రకాశం జిల్లాలో సైకో లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న యాత్రలో అవాస్తవాలు ప్రకటించడం సరికాదన్నారు. చేతనైతే ప్రకాశం జిల్లాకు 2014-19లో ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నాయకురాలు లీలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో కన్నతండ్రిని చంపిన కుమారుడు


మృతిచెందిన వెంకటేశ్వర్లు

గిద్దలూరు రూరల్: క్షణికావేశంలో ఓ వ్యక్తి తన కన్న తండ్రిని కర్రతో తలమీద కొట్టి చంపిన సంఘటన గిద్దలూరు పట్టణంలోని చాకలివీధిలో శనివారం జరిగింది. నగిరి వెంకటేశ్వర్లు (60) మద్యం తాగి కుటుంబ సభ్యులతో ఘర్షణ పడుతున్న సమయంలో ఆవేశానికి లోనైన అతని రెండో కుమారుడు నగిరి రసూల్ కర్రతో వెంకటేశ్వర్లు తలమీద కొట్టాడు. దీంతో గాయాలపాలైన వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రసూల్‌కు ఒక్కొక్కసారి మానసిక స్థితి సక్రమంగా ఉండదని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


మృతుడు అంజి

కనిగిరి రూరల్: పొట్ట కూటి కోసం వచ్చిన ఎగ్జిబిషన్ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృత్యు ఒడికి చేరాడు. ఈ ఘటన శనివారం రాత్రి కనిగిరిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నంద్యాలకు చెందిన కాటం అంజిరెడ్డి(35) ఆటో డ్రైవర్. అయితే ఎగ్జిబిషన్ ప్రోగ్రాం వస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయమని.. స్నేహితుడి అన్న మహబూబ్ నిర్వహించే ఎగ్జిబిషన్‌లో కార్మికుడిగా చేరాడు. నెల రోజుల నుంచి న్యూ స్టార్ ఎగ్జిబిషన్ పొదిలిలో జరిగింది. ఎగ్జిబిషన్ అక్కడి నుంచి మార్చి కనిగిరిలో పెట్టేందుకు శనివారం వచ్చారు. ఈ మేరకు పర్మిషన్లు తీసుకుని.. రాత్రి సమయంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్కన ఉన్న పాత ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లారీలో సామాగ్రి దించుతున్నారు. ఈ క్రమంలో కార్మికుడు అంజిరెడ్డి లారీ పైకి ఎక్కి సామాన్లు కట్టి ఉన్న తాడును ఊడ తీసే క్రమంలో పైన ఉన్న కరెంట్ తీగలకు తగిలాడు. దీంతో ఒక్కసారిగా కరెంట్ షాక్ గురై పై నుంచి కింద పడ్డాడు. క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

శిరీష, దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజల గొంతును బలంగా వినిపిస్తున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, అమరుల బంధుమిత్రుల సంఘ నాయకురాలు శిరీష అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఉపా రద్దు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. శనివారం ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అని విమర్శించారు. తక్షణమే శిరీష, ప్రభాకర్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సమన్వయ సంఘ నాయకులు చుండూరి రంగారావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నాయకుడు దాసరి సుందరం తదితరులు పాల్గొన్నారు.

నాడు దుర్భిక్షం.. నేడు సస్యశ్యామలం

- రామతీర్థం..గుండ్లకమ్మలకు శిలాఫలకాలేసి వదిలేసిన చంద్రబాబు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి జాతికి అంకితం చేసిన వైఎస్సార్
- నాడు రామతీర్థానికి జలాలు రాక బీడుగా మారిన పొలాలు
- టీడీపీ ప్రభుత్వ తీరుతో తుప్పు పట్టిన గుండ్లకమ్మ గేట్లు
- సీఎం జగన్ పాలనలో సాగర్ జలాలు పుష్కలం


వైఎస్ చేతుల మీదుగా జాతికి అంకితం చేసిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్

చీమకుర్తి: చంద్రబాబు ఉత్త మాటల నేత అనేందుకు ఉదాహరణలు కోకొల్లలు. 2004 సార్వత్రిక ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయన్న సమయంలో 2003లో హడావుడిగా గుండ్లకమ్మ ప్రాజెక్ట్, రామతీర్థం రిజర్వాయర్‌లకు శంకుస్థాపన చేశారు. అయితే రామతీర్థం వద్దకు రాకుండానే శిలాఫలకాన్ని గుండ్లకమ్మలోనే వేసి అంతా ముక్కున వేలేసుకొనేలా చేశారు. శంకుస్థాపన రాళ్లు ఏడాది పాటు సమాధి రాళ్లుగా దర్శనమిచ్చాయి. రాజకీయ జిమ్మిక్కులతో బాబు రైతులను, ప్రజలను మోసం చేశారు.

రాజశేఖరుని పాలనలో పచ్చదనం..

అనంతరం ముఖ్యమంత్రిగా అధికార పీఠం చేపట్టిన వెంటనే వైఎస్ రాజశేఖరరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌కు రూ.600 కోట్లు, రామతీర్థం రిజర్వాయర్‌కు రూ.50 కోట్లు కేటాయించి మూడేళ్లనే పూర్తి చేసి రెండింటినీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రామతీర్థం నుంచి 70 వేల ఎకరాలు, గుండ్లకమ్మ నుంచి 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడింది. బీడు భూములు వైఎస్సార్ పాలనలో సస్యశ్యామలంగా మారాయి. మళ్లీ అధికారంలోకి 2014లో చంద్రబాబు రాగానే వీటికి గ్రహణం పట్టింతది. ప్రాజెక్టుకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో గుండ్లకమ్మ గేట్లు తుప్పుపట్టాయి. సుందరీకరణ పేరుతో టీడీపీ నేతలు నిధులు మింగేశారు. దీంతో గేట్లుకు సరైన మరమ్మతులు లేక తుప్పుపట్టి 3వ గేటు కొట్టుకుపోవడానికి టీడీపీ కక్కుర్తే కారణమంటూ రైతులు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

శాశ్వత ప్రాతిపదికన గేట్ల మరమ్మతులు

తాజాగా వైఎస్సార్ సీపీ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతుల కోసం రూ.9 కోట్లు వరకు ఎస్టిమేషన్‌లు వేసి సిద్ధం చేశారు. ఇప్పటికే రూ.1.90 కోట్లు విడుదల చేసి 6, 7 గేట్లను మరమ్మతులు చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా ఉండేలా పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత శాశ్వత ప్రాదిపదికన పనులు చేపట్టేలా ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా గుండ్లకమ్మ నుంచి ఖరీఫ్ సీజన్‌లో రైతుల సాగుకు ఎలాంటి విఘాతం లేకుండా నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

బాబు పాలనలో అడుగంటిన రామతీర్థం

చంద్రబాబు 2014-19 పాలనా కాలంలో సాగర్ డ్యామ్ నుంచి సాగర్ నీళ్లు వచ్చిందే లేదు. రామతీర్థం రిజర్వాయర్ నిండిందీ లేదు. రైతులు పలు మార్లు రోడ్డు ఎక్కి ధర్నాలు చేశారు. ఇరిగేషన్ కార్యాలయానికి తాళాలు కూడా వేశారు. అయినా వారి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం జగన్ పాలనలో గత నాలుగేళ్ల నుంచి రామతీర్థం రిజర్వాయర్ నిండుకుండాల తొణికిసలాడుతూనే ఉంది. సాగర్ డ్యామ్ నుంచి జిల్లా వాసులకు తాగు, సాగు నీటి కోసం ఏడాది సరాసరిన 55-60 టీఎంసీలకు తక్కువ కాకుండా జలాలు విడుదల చేయటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. దాని ప్రభావంతోనే గత నాలుగేళ్లలో రైతులు వరి పంటలకే కుండా సుబాబుల్, పొగాకు పంటలకు కావాల్సిన నీటిని కూడా వాడుకున్నారు. ఇప్పుడు జిల్లాలో అడుగు పెట్టిన నారా వారసుడు లోకేష్.. వైఎస్సార్, సీఎం జగన్‌లా వ్యవసాయాన్ని స్వర్ణయుగంలా మారుస్తాడా.. లేక తన తండ్రిలా మారుస్తాడా అని అంతా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.


జగన్ పాలన స్వర్ణ యుగం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన గత నాలుగేళ్ళ నుంచి రైతులకు స్వర్ణయుగం లాంటిదని చెప్పవచ్చు. ఏనాడు కూడా రైతులకు సాగర్ జలాలు లేవని, ఇవ్వలేమని చేతులెత్త లేదు. టీడీపీ పాలనలో సాగర్ జలాలు లేక రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేశారు.

పమిడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, చీమకుర్తి


శిలాఫలకాలు తప్ప చేసిందేముంది బాబూ



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్ట్‌లకు శిలాఫలకాలు వేయటం తప్ప చేసిందేమీ లేదు. అదే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్ట్‌లను జాతికి అంకితం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న గత నాలుగేళ్ళలో సంతోషంగా ఉన్నాం.

వేమా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు, చీమకుర్తి


రామతీర్థం రిజర్వాయర్ పరిస్థితి (2013-14లో)


నాలుగేళ్ళ నుంచి నిండుకుండలా తొణికిసలాడుతున్న రామతీర్థం రిజర్వాయర్


సాగర్ నీళ్ళు రాకపోవడంతో ఇరిగేషన్ కార్యాలయానికి తాళం వేస్తున్న రైతులు (2018లో)